క్లుప్తంగా

వంద మందికి కంటి పరీక్షలు


శిబిరంలో కంటి పరీక్ష చేయించుకుంటున్న మహిళ

బిక్కవోలు: మెళ్లూరు జీసస్ హోమ్ మినిస్ట్రీస్ ఆ ధ్వర్యంలో వాసన్ ఐ కేర్ నిర్వహణలో జీసస్ హోమ్ చర్చి వద్ద మంగళవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మినిస్ట్రీస్ డైరెక్టర్ జాన్ డేవిస్ ప్రారంభించారు. శిబిరంలో వంద మందికి వైద్య సేవలు అందించగా, వారిలో 50 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. 15 మందిని శస్త్రచికిత్సల కోసం కాకినాడ వాసన్ ఐ కేర్‌కు తీసుకువెళ్లారు.

భక్తిశ్రద్ధలతో అభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

బిక్కవోలు: గ్రామంలోని కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులందరికీ దేవదాయశాఖ ఆధ్వర్యంలో అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రామలింగ భాస్కర్, సిబ్బంది ప్రసాద్, రవి, సత్తిబాబు పాల్గొన్నారు.

వంద లీటర్ల సారా స్వాధీనం

సీతానగరం: మండలంలోని చీపురుపల్లి శివారున సారా తరలిస్తున్న పీతల ప్రసాద్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్ కుమార్ తెలిపారు. ప్రసాద్ తన స్కూటీపై సారా తరలిస్తుండగా దాడి చేయగా, స్కూటీ, సారాను వదిలి పరారయ్యాడన్నారు. వంద లీటర్ల సారా, స్కూటీని స్వాధీనం చేసుకున్నామని, పరారైన ప్రసాద్‌పై కేసు నమోదు చేశామన్నారు.

కృష్ణారెడ్డి సోదరులకు పరామర్శ


కృష్ణారెడ్డి సోదరులను పరామర్శిస్తున్న సినీ దర్శకుడు చంద్రమహేష్

పెదపూడి: అనపర్తి మండలం రామవరంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి, గ్రామ ఉప సర్పంచ్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఆయన సోదరులు శ్రీనివాసరెడ్డి, వెంకటకృష్ణారెడ్డిలను సినీ దర్శకుడు చంద్ర మహేష్ మంగళవారం పరామర్శించారు. కృష్ణారెడ్డి తల్లి బాపాయమ్మ ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు ఎఫ్‌ఎం రేడియో ఆర్టిస్ట్ వెంకట్రామయ్య (గోదారి కిట్టయ్య), పలువురు ఎన్డీఏ నాయకులు పరామర్శించారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

మధురపూడి: సస్యరక్షణ చర్యలతో ఆయిల్‌పామ్‌లో అధిక దిగుబడులను సాధించవచ్చని ఉద్యానవనశాఖ కోరుకొండ మండలాధికారి పి.రినీ అన్నారు. కోరుకొండ మండలం మధురపూడిలో మంగళవారం ఆయిల్‌పామ్ రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రినీ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ తోటల్లో డ్రిప్ ఇరిగేషన్ పద్ధతిని అవలంబించడం వల్ల మొక్క మొదలుకు నీరు చేరుతుందన్నారు. సస్యరక్షణ చర్యలను క్రమం తప్పకుండా పాటించడం వల్ల దిగుబడి పెరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం ఆయిల్ పామ్ టన్ను ధర రూ.20,290 ఉండడంతో రైతులు ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. పతంజలి ఫుడ్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ డీజీఎం ఏఎస్ ప్రకాశ్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ రైతులకు నిరంతరం అవగాహన కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు, భరోసా కల్పిస్తున్నట్టు తెలిపారు. కోరుకొండ మండలంలో 900 హెక్టార్ల విస్తీర్ణంలో 200 మంది రైతులు సాగు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఆఫీసర్ శ్రీనివాస్, క్లస్టర్ ఇన్‌చార్జి వి.దుర్గాప్రసాద్, రైతులు తిరుమలనాథుని సుబ్బారావు, ఆకుల సూరబ్బాయి పాల్గొన్నారు.

మంచం పట్టిన పింఛన్‌దారుల తనిఖీ నేడు

సీతానగరం: మండలంలోని 15 సచివాలయాల పరిధిలో మంచం పట్టిన పింఛన్‌దారులను వారి ఇంటి వద్ద వైద్య బృందాలు బుధవారం పరిశీలిస్తారని ఎంపీడీవో ఎం.భారతి తెలిపారు. ఆమె మంగళవారం మాట్లాడుతూ 15 సచివాలయాల పరిధిలో 34 మంది మంచం పట్టిన పింఛన్‌దారులు ఉన్నారన్నారు. రెండు వైద్య బృందాలు ఆయా గ్రామాల్లో పెన్షన్‌దారుల ఇంటికి నేరుగా వెళ్లి పరిశీలిస్తాయన్నారు. బొబ్బిల్లంక-2, రఘుదేవపురం-2, సీతానగరం-1, కాటవరం, నాగంపల్లిలో మంచం పట్టిన పింఛన్‌దారులు లేరన్నారు. మిగిలిన సచివాలయాల పరిధిలోని ఉన్న వారందరినీ వైద్య బృందం పరిశీలిస్తుందన్నారు.

దిగుబడికి బాటలు

- కాలిబాటలతో ఎంతో ప్రయోజనం
- చీడపీడల నుంచి పంటలకు రక్షణ
- ఖర్చు ఆదా, దిగుబడి పెరిగే అవకాశం


పెదపూడిలో కాలిబాటలు వేసిన పొలం

పెదపూడి: వ్యవసాయం చేసేటప్పుడు రైతులు అనేక విధానాలను అవలంబిస్తూ ఉంటారు. విత్తు నాటినప్పటి నుంచే ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు. పంట ఏపుగా పెరగాలని, దిగుబడి బాగా రావాలని కోరుకుంటారు. విత్తనాలు, ఎరువులు, నీరు, వాతావరణం..ఈ అంశాలన్నీ దిగుబడిలో కీలకంగా ఉంటాయి. వాటిలో పాటు వరిసాగులో కాలిబాటలకు ఎంతో ప్రత్యేకత ఉంది. వాటి వల్ల పైరుకు చీడపీడల సమస్య తగ్గుతుంది. తద్వారా పెట్టుబడి వ్యయం తగ్గడంతో ఆదాయం పెరుగుతుంది.

తప్పనిసరి

పొలంలో కాలిబాటలు వేయడానికి చాలా మంది తటపటాయిస్తుంటారు. దీన్ని అనవసర వ్యయంగా భావిస్తారు. ఎకరా పొలంలో కాలిబాటలు వేయడానికి సుమారు రూ.800 వరకూ ఖర్చవుతుంది. వీటి వల్ల దిగుబడి సుమారు నాలుగు బస్తాల వరకు పెరిగే అవకాశం ఉంది. రైతులు తప్పనిసరిగా వరి చేలల్లో కాలి బాటలు వేసుకోవాలని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

57,442 ఎకరాల్లో సాగు

అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లోని ఏడు మండలాల్లో ఈ రబీ సీజన్‌లో 57,442 ఎకరాల్లో వరిని సాగు చేస్తున్నారు. మండలాల వారీగా అనపర్తిలో 12 వేలు, పెదపూడిలో 18 వేలు, రంగంపేటలో 2 వేలు, బిక్కవోలులో 13 వేలు, కోరుకొండలో 2,465, సీతానగరంలో 1,917, రాజానగరంలో 8,060 ఎకరాల్లో పండిస్తున్నారు. అయితే ఆయా మండలాల్లో 80 శాతం వెద సాగు, 20 శాతం వరి నాట్లు వేసే విధానంలో ప్రక్రియను పూర్తి చేశారు.

కాలిబాటలు వేసుకునే విధానం

కాలిబాటలు వేసుకునే సమయంలో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి. పొడవైన ప్లాస్టిక్ తాడును గట్టుకు ఒక వైపు నుంచి రెండో వైపు వరకూ సాగదీసి కట్టాలి. తాడు వెంబడి 12 సెంటీమీటర్ల వెడల్పున వరి నాట్లు తొలగించి పక్కనే పలుచగా ఉన్న చోట నాటు కోవాలి. చేను గట్టు పక్క నుంచి అడుగు దూరంలో కాలి బాట వేసి, అక్కడి నుంచి ప్రతి రెండు మీటర్ల దూరంలో ఒకొక్కటి వేసుకుంటూ వెళ్లాలి. కొందరు రైతులు ప్రతి 6 నుంచి 7 మీటర్లకు ఒక కాలిబాట వేస్తుంటారు. దీంతో ప్రయోజనం ఉండదు. ముందు నాట్లు వేసిన రైతులు గట్లకు ఇరువైపులా తాడు కట్టి మార్కు చేసిన చోట ఉన్న మొక్కలను తీసి వేసి కాలిబాట వేస్తుంటారు. వెదజల్లే పద్ధతిలో పైరు ఎదుగుతున్న సమయంలో 15 నుంచి 20 రోజుల వ్యవధిలో 20 సెంటీ మీటర్ల వెడల్పులో వరి నాట్లు తొలగించి కాలిబాట వేసుకోవచ్చు.

అదనపు దిగుబడి



"కాలిబాటల వేయడంతో దిగుబడి తగ్గదు. పైగా రెండు, మూడు బస్తాలు అదనంగా వస్తుంది. చేనులో సస్యరక్షణ చర్యలు తీసుకోవడం సులభమవుతుంది. వ్యవసాయ నిపుణుల సూచనల మేరకు పొలంలో కాలిబాటలు వేసుకుంటే ఎంతో ప్రయోజనం కలుగుతుంది."

– టీవీఆర్ మణిదీప్, వ్యవసాయశాఖ అధికారి, పెదపూడి మండలం

ఉపయోగాలివే..

- కాలిబాటతో పైరు మొదళ్ల వరకు వెలుతురు, గాలి, ఎండ సమృద్ధిగా తగులుతుంది. దీంతో పైరు ఆరోగ్యవంతంగా ఎదుగుతుంది. చీడపీడల బెడద కొంత వరకూ తగ్గుతుంది.
- కాలిబాట మార్గంలో వెళ్లి కలుపు మొక్కలు తొలగించడానికి, మందులు చల్లుకోవడానికి వీలవుతుంది.
- తెగుళ్లను గుర్తించి సస్యరక్షణ చర్యలు తీసుకోవడానికి, ఎలుకల నివారణకు వీలుగా ఉంటుంది.
- తుపానులు, భారీ వర్షాలు తదితర ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైనప్పుడు మొక్కల్లో కిరణ జన్య సంయోగ క్రియ సమర్థంగా జరిగి దిగుబడి పెరుగుతుంది.
- పైరులో చీడపీడల ఉధృతిని అతి సమీపం నుంచి గమనించి, దానికి అనుగుణంగా సకాలంలో సస్యరక్షణ తీసుకునే వీలుంటుంది.

నేడు విద్యుత్ అంతరాయం

మధురపూడి: కోరుకొండ సబ్ స్టేషన్ పరిధిలోని కోటికేశవరం ఫీడర్‌లో వార్షిక మరమ్మతులు, చెట్లకొమ్మలు కత్తిరింపు కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. 33/11 కేవీ లైన్‌లోని కోటికేశవరం, రాఘవపురం, బొల్లెద్దుపాలెం, నాగంపల్లి గ్రామాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా నిలిపేస్తున్నట్టు ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

జాబ్ మేళాలో 31 మందికి ఉద్యోగాలు

రాజానగరం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాలో 31 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, డిపార్టుమెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్, శిక్షణ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. జాబ్ మేళాకు వచ్చిన 59 మందికి మూడు కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వారిలో 31 మందిని ఉద్యోగులకు ఎంపిక చేశారని ప్లేస్‌మెంట్ అధికారి ప్రియ, జేఈ రాజ్‌కుమార్ తెలిపారు.

ఇళ్ల స్థలాల లేఅవుట్ కాలనీ పరిశీలన


ఎంపీడీఓ, తహసీల్దార్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

పెదపూడి: అనపర్తిలోని కొత్తూరు ఇళ్ల స్థలాల లేఅవుట్ కాలనీని కలెక్టర్ పి.ప్రశాంతి మంగళవారం సందర్శించారు. అక్కడ నిర్మాణం పూర్తయిన గృహాలు, నివాసం ఉంటున్న వారి వివరాలను ఎంపీడీఓ రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ అనిల్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫిబ్రవరి ఒకటిన తూర్పు గోదావరి జిల్లా పర్యటనలో గృహ ప్రవేశాలు, ఎన్టీఆర్ సామాజిక భద్రత పెన్షన్ పంపిణీ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. అనపర్తిలో కూడా చంద్రబాబు పర్యటన చేపట్టే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందుగానే ఈ ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ ప్రశాంతి సందర్శించారు.

సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎంపీడీఓ నరేంద్రరెడ్డి, ఇతర అధికారులు

పెదపూడి: గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఫిబ్రవరి 15వ తేదీ నాటికి వినియోగంలోకి తీసుకురావాలని ఎంపీడీఓ కె.నరేంద్ర రెడ్డి తెలిపారు. రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ ఆధ్వర్యంలో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ వీడియో కాన్ఫరెన్స్‌లో కమిషనర్ ఆదేశాలపై మార్చి నెల 15వ తేదీ నాటికి ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి, సంపద తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. దానికి సంబంధించి క్లాప్ మిత్రలను నియమించుకోవాలని ఆదేశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గంగాధర్, సచివాలయం అధికారులు పాల్గొన్నారు.

చట్టాలపై మహిళలకు అవగాహన అవసరం


సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రకాష్‌బాబు

రాజానగరం: మహిళల రక్షణ కోసం ప్రభుత్వం అనేక చట్టాలను అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలంటే ముందుగా వాటిపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ప్రకాష్‌బాబు సూచించారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో 'విధాన్ సే సమాధాన్' పేరిట మంగళవారం మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ప్రస్తావిస్తూ, అటువంటి సమయంలో రక్షణ కోసం పోలీసులకు ఏవిధంగా ఫిర్యాదు చేయాలో తెలియజేశారు. న్యాయవాదులు బి. పద్మావతి, వి.సుజాత మాట్లాడుతూ లైంగిక వేధింపులు, వరకట్నం చేసే అత్తింటివారు పెట్టే హింసలు, గృహ హింస, మానవ అక్రమ రవాణా, బాల్య వివాహాలను ఎదుర్కొనేందుకు ఉన్న చట్టాలపై అవగాహన కలిగించారు. చేనేతలు, కూలీలు, తాపీపనివారు, గృహిణులు, చేపలు విక్రయించేవారు, గృహాలలో పని చేసేవారు, చిరు వ్యాపారులు.. ఇలా వివిధ రకాల వృత్తులలోని మహిళలకు రక్షణగా ఉన్న న్యాయ సంబంధిత చట్టాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సంక్షేమ శాఖ అధికారి కె.విజయకుమారి, ఐసీడీఎస్ సీడీపీఓ టి.నాగమణి, సూపర్ వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లల సంక్షేమమే తల్లిదండ్రుల ధ్యేయం


మాట్లాడుతున్న సుద్దాల అశోక్ తేజ

రాజానగరం: పిల్లల సంక్షేమం కోసం నిరంతరం నిస్వార్థంగా ఆలోచించేదీ, అడుగులు వేసిదీ తల్లిదండ్రులేనని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ అన్నారు. దివాన్ చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో మంగళవారం నిర్వహించిన 'అభినందన' కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నవమాసాలు మోసి అమ్మ జన్మనిస్తే, ఆ జన్మకు ఒక సార్థకతను తీసుకురావడం కోసం తండ్రి తపిస్తాడన్నారు. అటువంటి వారు చెప్పే మాటలను ఒక వేదంగా తీసుకోవాలన్నారు. తల్లిదండ్రులను గౌరవించేవారు, పెద్దల మాటలను మన్నించేవారు సమాజంలో ఎందరో ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు. ఈ అభినందనలో కొట్టే చప్పట్లు మీ విజయాలకు మెట్లు కావాలన్నారు. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం మంచిదే, కానీ అదే పనిగా సెల్‌ఫోన్లకు బానిసలు కావొద్దన్నారు. ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండటం, గతాన్ని మరువకపోవడం ఉత్తమ లక్షణాలన్నారు. అనంతరం విద్య, క్రీడలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో విద్యానికేతన్ డైరెక్టర్ విజయ ప్రకాష్, ప్రిన్సిపాళ్లు ఎంవీవీఎస్ మూర్తి, ఏవీఎస్ మూర్తి, విమల, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో వ్యాధుల నుంచి రక్షణ


కాపవరంలో పోస్టర్ విడుదల చేసిన ఏడీ శ్రీనివాసరావు


నిడిగట్లలో నట్టల వ్యాధి నివారణ మందు అందజేస్తున్న వైద్యులు

మధురపూడి: పశువులు, జీవాల పెంపకంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ ఏడీ పి.ప్రభావతి అన్నారు. కోరుకొండ మండలం నిడిగట్లలో మంగళవారం నిర్వహించిన పశువైద్య శిబిరంలో మె మాట్లాడారు. ప్రభుత్వం సబ్సిడీ ద్వారా ఇస్తున్న మినీ గోశాలలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో పశువులకు పరీక్షలు జరిగి వైద్యం అందించారు. కార్యక్రమంలో డాక్టర్లు వనిత, రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

సీతానగరం మండలంలో..

సీతానగరం: మండలంలోని ఉండేశ్వరపురం, మిర్తిపాడు గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహించారు. 110 పశువులకు, 250 మేకలు, గొర్రెలకు డాక్టర్ ఫణీంద్ర వైద్యసేవలు అందించారు. మిర్తిపాడు పశు వైద్యశిబిరాన్ని అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ప్రభావతి సందర్శించారు. ఉండేశ్వరపురంలో సర్పంచ్ మాకాల ఈశ్వరరావు, ఉపసర్పంచ్ పెనుగుల నాగేశ్వరరావు, డీసీసీబి మెంబర్ చిత్ర శ్రీరంగ నాయకులు, కూటమి నాయకులు బర్రే శ్రీనివాస్, యర్రమల్లి అప్పన్న చేతుల మీదుగా పాడి రైతులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఏ ఆదిలక్ష్మి, ఏహెచ్‌ఎలు పాల్గొన్నారు.


మిర్తిపాడులో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ ఫణీంద్ర

కాపవరంలో..

బిక్కవోలు: కాపవరంలోని రైతు సేవా కేంద్రం ఆవరణలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అనపర్తి పశువైద్య సంవర్ధక శాఖ ఏడీ వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ నట్టల నివారణ, వ్యాధి నిరోధక టీకాలు, వివిధ పథకాలను వివరించారు. అనంతరం పశువులకు వైద్య సేవలు అందించి, పాడి రైతులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాడి రైతుల బీమా పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలోని పశు వైద్యులు ప్రణీత్, వీర్రాజు, రవి కుమార్ పాల్గొన్నారు.

జాగ్రత్తలు అవసరం

కట్టుదిట్టంగా సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్షలు


ప్రశ్నపత్రాల బండిల్స్ అందజేస్తున్న డీఐ దిలీప్ కుమార్

కంబాలచెరువు: అన్ని యాజమాన్యాల పాఠశాలల విద్యార్థులకు సెల్ఫ్ అసెస్మెంట్ మోడల్ పేపర్ - 3 పరీక్షలు ప్రారంభమయ్యాయని అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ తెలిపారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్టోరేజ్ పాయింట్ నుంచి ప్రధానోపాధ్యాయులకు మంగళవారం ప్రశ్నపత్రాల బండిల్స్ అందజేశారు. ప్రతిరోజు పరీక్ష సమయానికి గంట ముందుగా ప్రశ్నపత్రాల బండిల్స్‌ను ప్రధానోపాధ్యాయులకు మాత్రమే అందజేస్తామన్నారు. ఎవరైనా ప్రధానోపాధ్యాయులు రాలేని పక్షంలో ఒక ఉపాధ్యాయునికి ఆథరైజేషన్ లెటర్ ఇచ్చి పంపిస్తేనే ఇవ్వడం జరుగుతుందన్నారు. పరీక్షలను అత్యంత కట్టుదిట్టంగా నిర్వహించాలని, మిగిలిన ప్రశ్న పత్రాలను జాగ్రత్తగా భద్రపరచాలన్నారు. పరీక్షల నిర్వహణ విషయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా ఆయా ప్రధానోపాధ్యాయులు బాధ్యత వహించాలన్నారు. ఈ పరీక్షల్లో కొన్ని జవాబులు ఓఎంఆర్ షీట్‌లపై గుర్తించాల్సి ఉంటుందని, విద్యార్థులందరికీ వారి పేర్లతో ఓఎంఆర్ షీట్లను ప్రధానోపాధ్యాయులకు అందజేసినట్టు తెలిపారు. ఎవరికైనా తక్కువ వస్తే, బఫర్ ఓఎంఆర్‌లను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీఈబీ సెక్రటరీ దేవా అనిత, ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంవీఎం సుబ్రహ్మణ్యం, సీఆర్ఎంటీలు జయంతి శాస్త్రి, జె.శ్రీనివాసరావు, పబ్బినీడి ప్రసాద్, ఇందిర, కుమారి, కోటేశ్వరి, నాగలక్ష్మి, సునీత పాల్గొన్నారు.

ఔత్సాహిక కళాకారులకు ప్రోత్సాహం


కార్యక్రమంలో పాల్గొన్న హాస్యనటుడు గౌతంరాజు తదితరులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహించి, వారికి సినీ పరిశ్రమలో అవకాశాలు ఇప్పించడానికి తన వంతు కృషి చేస్తానని మా ఏపీ అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రముఖ హాస్యనటుడు గౌతంరాజు అన్నారు. మా ఏపీ అసోసియేషన్, గోదావరి మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని ఓ హోటల్లో వర్ధమాన కళాకారుల పరిచయ కార్యక్రమం, ఆడిషన్స్ ఆయన అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా గౌతంరాజు మాట్లాడుతూ వర్ధమాన కళాకారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సుమారు 80 మంది కళాకారులు వచ్చి, ఆడిషన్ ఇచ్చారు. కార్యక్రమంలో జబర్దస్త్ ఆర్టిస్ట్ హరిబాబు, స్టేజ్ ఆర్టిస్ట్ గవర్రాజు, చంద్రరావు, జీమా ఫౌండర్ మహేష్, జి.ప్రెసిడెంట్ డీఎస్ఎస్ శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించడం తప్పనిసరి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత
- నగరంలో బైక్ ర్యాలీ



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

కంబాలచెరువు: ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పిలుపు ఇచ్చారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా జిల్లా రవాణా శాఖ కార్యాలయం ఆధ్వర్యంలో ఆర్టీఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీని మంగళవారం డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు, జిల్లా రవాణా అధికారి ఎం.సురేష్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ ద్విచక్ర వాహన దారులకు హెల్మెట్‌తో పాటు లైసెన్స్, ఇన్సూరెన్స్ తప్పనిసరి అన్నారు. మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని తెలిపారు. జిల్లాలో 2023లో జరిగిన 849 ప్రమాదాల్లో 329 మంది, 2024లో జరిగిన 728 ప్రమాదాల్లో 298 మృతి చెందారన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లాలో కార్పొరేట్, సామాజిక బాధ్యతలో భాగంగా వివిధ బ్యాంకులు, రోటరీ క్లబ్, హార్లిక్స్ ఫ్యాక్టరీ, తదితర సంస్థల ద్వారా సేకరించిన 550 హెల్మెట్లను ద్విచక్ర వాహనచోదకులకు పంపిణీ చేసినట్టు తెలిపారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి కృషి చేస్తూ, బైక్ ర్యాలీ నిర్వహించడంపై ఆర్టీవో అధికారులను అభినందించారు. ప్రమాదాల బారిన పడినవారు తలకు దెబ్బ తగిలి అచేతనంగా, మంచానికే పరిమితం అయ్యే సందర్భాలు ఉన్నాయన్నారు.

వేణుమాధవరావు సేవలు అభినందనీయం


వేణుమాధవరావును సత్కరిస్తున్న ఏడీఏలు శ్రీనివాసరెడ్డి, మల్లికార్జునరావు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం అర్బన్ వ్యవసాయ విస్తరణ అధికారి వేణుమాధవరావు అందించిన సేవలు అభినందనీయమని రాజమహేంద్రవరం, కోరుకొండ ఏడీఏలు శ్రీనివాసరెడ్డి, మల్లికార్జునరావు అన్నారు. రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ వ్యవసాయ విస్తరణ అధికారిగా అవార్డు అందుకున్న వేణుమాధవరావును జిల్లా వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం, రాజమహేంద్రవరం ఎన్జీవో అసోసియేషన్, వ్యవసాయ అధికారులు కలిసి మంగళవారం సాయంత్రం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. రాష్ట్ర జేఏసీ కార్యదర్శిగా, ఏఈఓ సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా వివిధ సమస్యలను వేణుమాధవరావు చిత్తశుద్ధితో పరిష్కరించి వ్యవసాయశాఖ మన్ననలు పొందారన్నారు. ఏఈఓల పదోన్నతులు విషయంలో, బీఎస్సీ ఇన్ సర్వీస్ సీట్ల విషయంలో శాంతియుతంగా పోరాడి సాధించారన్నారు. వ్యవసాయ అధికారులు శాంతా ఆలివ్, భీమరాజు, సరళ, ఎన్జీవో సంఘ నగర అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బారావు నాయుడు, ప్రవీణ్ కుమార్, మాధవ రావు సత్యమూర్తి, రమణారావు, జిల్లా ఏఈఓ సంఘ కోశాధికారి నాగేశ్వరరావు, పీటర్ పాల్గొన్నారు.